క్లుప్తంగా

మహిళా సమాఖ్య భవనంలోకి వరదనీరు



భవనంలోకి చేరిన వరద నీరు

కొత్తూరు: పట్టణంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దానికి తోడు ఎగువ ప్రాంతంలో ఉన్న సాయిరెడ్డి చెరువు అలుగు పారుతుండడంతో వరద ఉధృతి పెరిగింది. దీంతో పట్టణంలో గల మండల మహిళా సమాఖ్య భవనంలోకి వరద నీరు చేరుతోంది. ఇప్పటికే ఒక అడుగు మేర నీరు చేరుకుంది. అధికారులు స్పందించి భవనంలోకి వరదనీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు.

కారు, బైక్ ఢీ..

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

కొత్తూరు: కారు, బైకు ఢీకొని ద్విచక్ర వాహన దారుడు గాయపడ్డాడు. ఈ ఘటన పట్టణంలోని పెంజర్ల కూడలి జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు ప్రయాణిస్తున్న కారు కొత్తూరు నుంచి పెంజర్ల వెళ్లేందుకు కూడలిలో రోడ్డు దాటుతున్న బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

మొయినాబాద్: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసరమైతే తప్పా ఇళ్ల నుంచి బయటకు రావొద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలన్నారు. అత్యవసర పరిస్థితులు, ఏదైనా సమస్యలు ఉంటే 7989099402, 9989217322 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న విజయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. పోషణమాసంలో భాగంగా శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె ఆధ్వర్యంలో పోషణ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. పోషకాహారం లోపిస్తే రక్తహీనతతో అనేక వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధకమైన ఆహారాన్ని అందజేస్తున్నాయన్నారు. గర్భిణులలో పోషకాహార లోపాన్ని నివారిస్తే పుట్టబోయే బిడ్డ, తల్లి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. బాలింతలు, గర్భిణులు పాలు, పండ్లు, గుడ్లు, ఆకు కూరలు, చేపలు, చిరుధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



సీఐ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌ఐలు విజయ్, వెంకటేశ్

షాద్‌నగర్: షాద్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా శ్రీనివాస్ శనివారం బాధ్యతలను చేపట్టారు. జీడిమెట్లలో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన సీఐని జిల్లేడ్‌చౌదరిగూడ ఎస్‌ఐలు విజయ్, వెంకటేశ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

'స్థానిక' సందడి

- ఆర్డీఓ కార్యాలయంలో రిజర్వేషన్‌లపై నాయకులతో సమావేశం
- మండలాల వారీగా వచ్చిన అనధికార ప్రకటనతో హల్‌చల్



చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయం

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పంచాయతీరాజ్, మండల పరిషత్ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లపై అధికారులు కసరత్తు పూర్తి చేశారు. నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చంద్రకళ ఆధ్వర్యంలో డివిజన్‌లోని నాలుగు మండలాలకు సంబంధించి వివిధ పార్టీ నాయకులతో రిజర్వేషన్లపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 42 శాతం బీసీ రిజర్వేషన్‌లతో పాటు, మహిళలకు 50 శాతం సీట్లు కేటాయింపుపై లాటరీ పద్ధతి ప్రక్రియను నిర్వహించారు. అధికారులు రిజర్వేషన్లను అధికారికంగా ప్రకటించలేదు. కానీ రాజకీయ పార్టీల నాయకులు సమావేశంలో మండలాల వారీగా సేకరించిన సమాచారంతో వచ్చే రిజర్వేషన్లపై స్పష్టత రావటంతో ఆయా మండలాల్లో రిజర్వేషన్లను ప్రకటించుకున్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ అనాధికారికంగా బయటకు రావటంతో ఉత్కంట నెలకొంది. దీంతో ఇన్నాళ్లుగా రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తున్న నాయకుల్లో కొందరు సంతోషం ఉండగా.. అనుకున్న రిజర్వేషన్లు రాని నాయకుల్లో నిరుత్సాహం కనిపించింది. చేవెళ్ల మండల ఎంపీపీ స్థానం ఎస్సీకి, జెడ్పీటీసీ స్థానం కూడా ఎస్సీకి రిజర్వు అయినట్లు ప్రచారం సాగుతోంది.

ఎంపీటీసీ, పంచాయతీల రిజర్వేషన్లు ఇలా..

మండలానికి సంబంధించి 10 ఎంపీటీసీ స్థానాలకు గాను ఎస్సీలకు 02(ఒకటి మహిళలకు) బీసీలకు 04(రెండు మహిళలకు), జనరల్‌కు 04(రెండు మహిళలకు) కేటాయించారు. ఇందులో న్యాలట(ఎస్సీ మహిళ), ముడిమ్యాల (ఎస్సీ), ఖానాపూర్-(బీసీ), చనువెళ్లి (బీసీ మహిళ), ఎన్కేపల్లి(బీసీ మహిళ), తంగడపల్లి(బీసీ), ఆలూరు-1(జనరల్), ఆలూరు-2(జనరల్), గుండాల (జనరల్ మహిళ), అంతారం(జనరల్ మహిళ).

పంచాయతీలకు..

పంచాయతీలకు సంబంధించి 25 పంచాయతీలకు గాను ఎస్సీలకు 06(మూడు మహిళలకు), బీసీలకు 11(మహిళలకు 5 స్థానాలు), జనరల్‌కు 08(మహిళలకు 4 స్థానాలు) కేటాయింపు జరిగినట్లుగా తెలుస్తోంది. ఎస్సీ రిజర్వు స్థానాలు అల్లవాడ(మహిళ), కుమ్మెర(మహిళ), ఖానాపూర్(మహిళ), న్యాలట, అంతారం, నాంచేరి గ్రామాలు కాగా బీసీ రిజర్వేషన్‌కు హస్తేపూర్(మహిళ), ఆలూరు(మహిళ), బస్తేపూర్(మహిళ), దేవరంపల్లి(మహిళ), ఎన్కేపల్లి (మహిళ), గొల్లపల్లి, కమ్మెట, ముడిమ్యాల, చనువెళ్లి, గుండాల, తంగడపల్లి ఉన్నాయి. ఇక జనరల్ స్థానాలకు గొల్లగూడ(మహిళ), మిర్జాగూడ(మహిళ), రావులపల్లి(మహిళ), రేగడిఘనాపూర్(మహిళ), తలారం, ఈర్లపల్లి, కౌకుంట్ల, సింగప్పగూడ గ్రామాలు ఉన్నాయి.

కొందుర్గు మండలంలో..

కొందుర్గు: స్థానిక ఎన్నికలకు సంబంధించి అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలిసింది. కొందుర్గు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు బీసీ జనరల్‌కు రిజర్వ్ అయినట్లు తెలిసింది. అదేవిధంగా కొందుర్గు 8 ఎంపీటీసీ స్థానాలకు ముట్పూర్ ఎస్సీ మహిళ, ఉత్తరాసిపల్లి ఎస్సీ జనరల్, చెర్కుపల్లి బీసీ మహిళ, చిన్నఎల్కిచర్ల, ఉమ్మెంత్యాల బీసీ జనరల్, తంగెళ్లపల్లి జనరల్ మహిళ, కొందుర్గు 1, 2 జనరల్ రిజర్వ్ అయినట్లు సమాచారం.

22 గ్రామపంచాయతీలకు..

మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి. అయోధ్యాపూర్ తండా ఎస్టీ జనరల్, వెంకిర్యాల, ఉత్తరాసిపల్లి, శ్రీరంగాపూర్ ఎస్సీ మహిళ, బైరంపల్లి, చిన్నఎల్కిచర్ల, కొందుర్గు ఎస్సీ జనరల్, లాలపేట, ముట్పూర్, విశ్వనాథ్‌పూర్, మహదేవ్‌పూర్ బీసీ మహిళ, ఆగిర్యాల, చెర్కుపల్లి, పర్వతాపూర్, రేగడిచిల్కమర్రి, టేకులపల్లి బీసీ జనరల్, లక్ష్మిదేవునిపల్లి, తంగెళ్లపల్లి, ఉమ్మెంత్యాల జనరల్ మహిళ, గంగన్నగూడ, పాత ఆగిర్యాల, పుల్సుమామిడి జనరల్‌కు రిజర్వ్ చేసినట్లు సమాచారం.

షాబాద్ మండలంలో..

షాబాద్: స్థానిక ఎన్నికలకు సంబంధించి అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలిసింది. మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలకు మద్దూరు ఎస్టీ జనరల్, నాగర్‌కుంట ఎస్సీ జనరల్, ఎల్గొండగూడ ఎస్సీ జనరల్, గొల్లూరుగూడ ఎస్సీ మహిళ, చందనవెళ్లి బీసీ మహిళ, హైతాబాద్ బీసీ జనరల్, కుమ్మరిగూడ బీసీ మహిళ, షాబాద్-1 బీసీ జనరల్, కక్కులూర్ బీసీ మహిళ, బోడంపహాడ్ బీసీ జనరల్, షాబాద్-2 జనరల్ మహిళ, సర్దార్‌నగర్ జనరల్ మహిళ, ముద్దెంగూడ జనరల్, రేగడిదోస్వాడ జనరల్, తాళ్లపల్లి జనరల్ 3. కానీ రిజర్వేషన్లపై కలెక్టర్ నుంచి గెజిట్ రాలేదని అధికారులు చెబుతున్నారు.

41 గ్రామ పంచాయతీల రిజర్వేషన్లలు ఇలా..

మద్దూర్ ఎస్టీ మహిళ, చర్లగూడ ఎస్సీ జనరల్, ఏట్ల ఎర్రవల్లి ఎస్సీ జనరల్, గొల్లూరుగూడ ఎస్సీ మహిళ, హైతాబాద్ ఎస్సీ జనరల్, మాచన్‌పల్లి ఎస్సీ మహిళ, పోతుగల్ ఎస్సీ జనరల్, సీతారంపూర్ ఎస్సీ మహిళ, తిర్మలాపూర్ ఎస్సీ మహిళ, షాబాద్ ఎస్సీ జనరల్, అంతారం బీసీ జనరల్, బొబ్బిలిగామ బీసీ జనరల్, తాళ్లపల్లి బీసీ మహిళ, బోడంపహాడ్ బీసీ మహిళ, చందనవెళ్లి బీసీ మహిళ, కక్కులూర్ బీసీ జనరల్, లక్ష్మారావుగూడ బీసీ జనరల్, నర్లెగూడ బీసీ మహిళ, పెద్దవేడు బీసీ మహిళ, రేగడిదోస్వాడ బీసీ మహిళ, సోలీపేట్ బీసీ జనరల్, కేసారం బీసీ మహిళ, కేశవగూడ బీసీ జనరల్, ఎల్గొండగూడ బీసీ జనరల్, నాగర్‌కుంట బీసీ జనరల్ మన్‌మర్రి బీసీ జనరల్, లింగారెడ్డిగూడ బీసీ జనరల్, అప్పారెడ్డిగూడ జనరల్, దామర్లపల్లి జనరల్ మహిళ, కొమరబండ జనరల్ మహిళ, కుమ్మరిగూడ జనరల్, కుర్వగూడ జనరల్, మక్తగూడ జనరల్, మల్లారెడ్డిగూడ జనరల్, ముద్దెంగూడ జనరల్ మహిళ, నాగర్‌గూడ జనరల్ మహిళ, పోలారం జనరల్, రుద్రారం జనరల్, సంకెపల్లిగూడ జనరల్ మహిళ సర్దార్‌నగర్ జనరల్, తిమ్మారెడ్డిగూడ జనరల్ కేటాయించినట్లు సమాచారం.

కొండా లక్ష్మణ్ ఆశయ సాధనకు కృషి



కొండా లక్ష్మణ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యాదవ్, నాయకులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొండా లక్ష్మణ్ జయంతిని శనివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీజేపీ నేత అందె బాబయ్య హాజరై పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించిన గొప్ప వ్యక్తి అన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు బాపూజీ అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌గౌడ్, జనార్దన్, ఒగ్గు కిషోర్, చెన్న బాల్‌రాజ్, దాస కృష్ణయ్య, రామస్వామి, అంజయ్య, రమేశ్, శివకుమార్, నర్సింలు, బాలకృష్ణ, రాములు, శివకుమార్, బాస వరలక్ష్మి, అరుణ, కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరి బస్వం కరుణాకర్, అనంతయ్య, సుధీర్, ఈశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

పైపులు వేసి వాహనాల రాకపోకలు కొనసాగింపు

సాక్షి ఎఫెక్ట్..



పైపులు వేసి వాహనాలు వెళ్లేందుకు వీలుగా పక్క నుంచి వేసిన రోడ్డు

మొయినాబాద్: కురుస్తున్న వర్షాలకు చిలుకూరు పెద్ద చెరువు నెల రోజుల నుంచి అలుగు పారుతుండడంతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి నిలిచిపోయిన రాకపోకలను తిరిగి పునరుద్ధరించారు. వరదనీరు వెళ్లేందుకు వీలుగా పైపులు వేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు పెద్ద చెరువు అలుగు పారడంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై 'భారీ గుంతలు.. నిలిచిన రాకపోకలు' అనే శీర్షికతో శనివారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. నెల రోజులుగా ఇలాంటి పరిస్థితి ఉంటే ఏం చేస్తున్నారంటూ మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేసి రాకపోకలను కొనసాగించాలని ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు ఆగమేఘాల మీద చిలుకూరుకు చేరుకొని అలుగు నీరు వెళ్లే విధంగా పైపులు వేశారు. మొరం, కంకర పోసి తాత్కాలికంగా కార్లు, ద్విచక్రవాహనాలు పక్కనుంచి వెళ్లే విధంగా రోడ్డును ఏర్పాటు చేశారు. ఆర్‌అండ్‌బీ ఈఈ రవీందర్‌కుమార్ పరిశీలించి శాశ్వత పరిష్కారంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని.. కానీ స్థానికులు సహకరించడం లేదని తెలిపారు.



షాద్‌నగర్‌రూరల్: సంబురాల్లో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి, సిబ్బంది

ఘనంగా బతుకమ్మ సంబురాలు



చేవెళ్ల: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



మొయినాబాద్‌రూరల్: బతుకమ్మలతో వైద్యాధికారి అన్నపూర్ణ, ఏఎన్‌ఎంలు

చేవెళ్ల: మండలంలోని పలు కళాశాలల్లో శనివారం ఘనంగా బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి, కళాశాల ఆవరణలో బతుకమ్మ ఆడారు.

పూలను పూజించే పండుగ

మొయినాబాద్‌రూరల్: పూలను పూజించే పెద్ద పండుగ బతుకమ్మ అని మండల వైద్యాధికారి అన్నపూర్ణ అన్నారు. శనివారం మండల ఆరోగ్య వైద్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి ఏఎన్‌ఎంలు తీరొక్క పూలతో తయారుచేసిన బతుకమ్మలను తీసుకొచ్చారు. బతుకమ్మ పాటలు, ఆటలతో వైద్య కేంద్రం మార్మోగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ వెంకట్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, వైద్యులు పాల్గొన్నారు.

చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి హాజరై బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. వైద్యులు, సిబ్బంది రంగు రంగుల పూలతో బతుకమ్మను తయారు చేసి.. బతుకమ్మ ఆట, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశంను కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో శనివారం ఆ కాలనీ ప్రజలు ఆయనను కలిసి సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా కాలనీలో నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, పలుమార్లు సిబ్బందికి చెప్పినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ట్యాంకర్ల ద్వారా నీటిని పోయించుకుంటున్నామని, దీంతో డబ్బులు చాలా ఖర్చు అవుతున్నాయన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ తప్పకుండా సమస్యను పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. కొత్త మున్సిపాలిటీ అయునందునా పూర్తిస్థాయి అధికారులు లేకపోవటంతో పాటు ఉన్నవారికి ఇంకా పట్టణ బాధ్యతలు తెలియకపోవటంతో కొంత సమస్య ఏర్పడుతోందన్నారు. తప్పకుండా కాలనీలో నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సాయికిరణ్, మద్దెల శ్రీను, మల్లారెడ్డి, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

శక్తి స్వరూపిణి నమోస్తుతే

దేవీ నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు, మండపాల్లో కొలువైన దుర్గామాతకు ఆరోరోజు శనివారం ఉత్సవ కమిటీల నిర్వాహకులు, ప్రజలు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారు లలితత్రిపుర సుందరిదేవి, మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు గ్రామాల్లో అన్నదానం చేశారు. –సాక్షి, నెట్‌వర్క్



చేవెళ్ల: శ్రీబాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సింహవాహనసేవను ఊరేగిస్తున్న భక్తులు



కొత్తూరు: పట్టణంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో..

జోరు వానలు.. పొంగిన వాగులు

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- పలు గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం
- నీట మునిగిన పంటపొలాలు
- ఆందోళనలో రైతన్నలు



నందిగామ: నందిగామ-నర్సప్పగూడ రహదారిని మూసివేసిన అధికారులు



నందిగామ చంద్రాయన్‌గూడ-అప్పారెడ్డిగూడ గ్రామాల మధ్య చిక్కుకున్న కారు



షాబాద్: నాగర్‌గూడ వద్ద ఈసీవాగు



శంకర్‌పల్లి: ప్రొద్దటూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు



షాబాద్: తాళ్లపల్లి వద్ద ఈసీవాగు ప్రవాహం



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ సమీపంలో ఉధృతంగా ఈసీవాగు

శంకర్‌పల్లి: రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మోకిల-టంగటూరు, ప్రొద్దటూరు బ్రిడ్జిలపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

పొంగిపొర్లిన వాగులు, వంకలు

నందిగామ: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.దీంతో పలు గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ నుంచి వీర్లపల్లికి వెళ్లే రహదారి, చంద్రాయన్‌గూడ నుంచి అప్పారెడ్డిగూడకు వెళ్లే రహదారిలో ఉన్న వాగుల నుంచి పెద్దఎత్తున నీరు ప్రవహిస్తుండటంతో ఆ రహదారులను మూసివేశారు.

వాగులో చిక్కుకున్న కారు.. తృటిలో తప్పిన ప్రమాదం

మామిడిపల్లి గ్రామానికి చెందిన యాదిరెడ్డి తన కారులో శనివారం ఉదయం చంద్రాయన్‌గూడ నుంచి మామిడిపల్లికి వెళ్తుండగా చంద్రాయన్‌గూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల మధ్యలో ప్రవాహిస్తున్న వాగులో చిక్కుకున్నాడు. వరదనీరు ఉధృతంగా ప్రవాహిస్తుండటంతో కారు అటు ముందుకు, ఇటు వెనక్కి వెళ్లలేక అలాగే ఇరుక్కుపోయాడు. విషయాన్ని గమనించిన స్థానికులు షాద్‌నగర్‌లోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి కారును బయటకు తీశారు. కారులోని వ్యక్తిని సురక్షితంగా కాపాడారు.

దెబ్బతిన్న పంటలు

షాబాద్: మండలంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షానికి ఈసీవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి, తాళ్లపల్లి, నాగర్‌గూడ, హైతాబాద్, సోలీపేట్, నాగరగూడ, తిమ్మారెడ్డిగూడ, రుద్రారం, చందనవెళ్లి, సోలీపేట్ గ్రామాల సరిహద్దు నుంచి వెళ్లే ఈ వాగులోకి వరదనీరు రావడంతో రైతులు సాగు చేసిన పంటలు పత్తి, వరి, పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

ఉధృతంగా ఈసీవాగు

మొయినాబాద్‌రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని అమ్డాపూర్ సమీపంలో గల ఈసీవాగు శనివారం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చుట్టూ పక్కన పంట పొలాలు, పశువుల పాకలు జలమయమయం కావడంతో రైతులు, పాడిరైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.